

అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గండేపల్లి

అటవీ ప్రదేశాల్లో జంతువులను వేటాడేందుకు వెళ్లిన వారిపై, జంతువుల కోసం విద్యుత్తు తీగల పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సిఐ వైఆర్కె శ్రీనివాస్ హెచ్చరించారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండల్లో కొందరు వన్యప్రాణుల వేటకు నాటు బాంబులు, నాటు తుపాకులు, విద్యుత్ వైర్లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. గతంలో ఇటువంటి సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోవడం, అవయవాలు కోల్పోవడం వంటి సంఘటనలు ఉన్నాయన్నారు.నాటు బాంబుల తయారీదారులు, వేటగాళ్ల వివరాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 9440796529, 9440796569, 9440904834, 9440904841, 100/112 నెంబర్లకి సమాచారం ఇవ్వాలని కోరారు.

నాడు 6.. నేడు 9

- పాలకులు వేరైనా విధానాలు అవే
- 9 రకాల పాఠశాలలతో తప్పని ఇబ్బందులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పాలకులు మారుతున్నారు గాని, వారి విధానాలు మారల్లేదు అనడానికి తాజాగా కూటమి సర్కారు విడుదల చేసిన జిఒలు 19, 20, 21లే నిదర్శనంగా ఉన్నాయి. గత వైసిపి సర్కారు కేంద్రంలో మోడీకి తలొంచి జిఒ 117ను తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఆ సమయంలో వైసిపి సర్కారుపై టిడిపి, జనసేన అధినేతలు నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 117ను రద్దు చేసి పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాట మరిచారు. పైగా ఆరు రకాల పాఠశాలల విద్యావ్యవస్థను తీసుకొచ్చి మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టారు.

విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు, బడి మానేస్తున్న వారి సంఖ్య తగ్గింపు, సబ్జెక్టు ఉపాధ్యాయులపై పని భారం తగ్గించడం, అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు అంటూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా 9 రకాల పాఠశాలలతో పాటు క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానాన్ని తీసుకొచ్చింది. వైసిపి ప్రభుత్వంలో తెచ్చిన 6 రకాల స్థానంలో కూటమి సర్కారు 9 రకాల బడుల వ్యవస్థను తీసుకురానుంది. ఈ విధానంలోనూ పలు పాఠశాలలు మూతపడే అవకాశం ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సవరించిన గణాంకాల ప్రకారం సాటిలైట్ స్కూల్స్ 8, ఫౌండేషనల్ స్కూల్స్ 500, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 1723, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 786, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ 114, హై స్కూల్స్ 500, హై స్కూల్ ప్లస్ బిపిఎస్ (1-10/1-12) 79 స్కూల్స్, హై స్కూల్ ప్లస్ ఎంపిఎస్ (1-10/1-12) 62 స్కూల్స్ మొత్తంగా 3,772 ఉన్నాయి. ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాలు పనిచేస్తున్న లాంగ్ స్టాండింగ్ ఉపాధ్యాయులు 2,600 మంది, నిర్దిష్టమైన ఖాళీలు 1300, రేసులైజేషన్ తర్వాత ఖాళీలు 2,500 మంది ఉన్నారు.

గత వైసిపి ప్రభుత్వం విద్యారంగంలో వినాశకరం నిర్ణయాలు తీసుకుందంటే, అంతకుమించి అన్నట్టుగా కూటమి సర్కారు వ్యవహరిస్తోంది. గత సర్కారు జిఒ 117తో 3,4,5 తరగతులను విలీనం చేసింది. దీంతో అనేకమంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలు బాట పట్టారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన వాటిల్లో భాగంగా 117 జీవోను కూడా రద్దుచేసి విద్య విధానాలను సరిదిద్దుతామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాని దాని విరుద్ధంగా మరిన్ని పాఠశాలలను మూసివేసే దిశగా కొత్త విద్యా విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీని కోసం జిఒ 19, 20, 21లను విడుదల చేసింది.

ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో 1,2 తరగతులకు మాత్రమే పాఠశాలలను పరిమితం చేసి రాబోయే రోజుల్లో అనేక పాఠశాలలు మూతపడే దిశగా ఈ ప్రభుత్వ విద్యా విధానాలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నూతన విద్యా విధానం వల్ల సింగిల్ డిజిట్స్ స్కూల్స్ పెరుగుతాయి. భవిష్యత్తులో ఆ పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. ఉదాహరణకు పెద్దాపురం పట్టణంలోని కొన్ని పాఠశాలలను పరిశీలిస్తే ప్రస్తుతం ఆరు సింగిల్ డిజిట్ స్కూల్స్ నాలుగు డబల్ డిజిట్ స్కూల్స్ ఉన్నాయి. చాలాక్య మున్సిపల్ హైస్కూల్లో 1,2 మినహా మిగిలిన 3,4,5 తరగతులను సమీపంలోని వేరే పాఠశాలకు మెర్జ్ చేయడంతో ఈ రెండు తరగతుల్లో ఆరుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఎస్ఎన్ మున్సిపల్ హైస్కూల్లో ఏడుగురు, బి.వి.ఆర్ హైస్కూల్లో 1,2 తరగతుల్లో ఆరుగురు, ఎమ్మెస్ మున్సిపల్ హై స్కూల్లో 1,2 తరగతుల్లో ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆజాద్ ఉర్దూ పాఠశాలలో 1,2 తరగతుల్లో ఐదుగురు, ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో 1,2 తరగతిలో ఒక్కరు కూడా లేరు. భవిష్యత్తులో ఈ పాఠశాలలు మూతపడతాయి. ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సింగిల్, డబుల్ డిజిట్ స్కూల్స్ గా మారనున్నాయి. అవీ క్రమంగా మూతబడతాయి. ఈ విధానం పేద, బడుగు, బలహీన వర్గాల చదువుకి చాలా తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఉపాధ్యాయులకు పని భారాన్ని తగ్గిస్తామని వాగ్దానం చేసిన ఈ ప్రభుత్వం ఒక్కొక్క ఉపాధ్యాయుడికి 36 నుంచి 40 పీరియడ్‌లు వారానికి బోధన ఇవ్వడం ద్వారా నాణ్యమైన బోధన జరిగే పరిస్థితి లేదు. అలాగే సబ్జెక్టులకు సిలబస్ ఆధారంగా కావాల్సిన పిరియడ్ల కన్నా తక్కువ కేటాయించి ఎక్కువ తరగతులను తక్కువ మంది ఉపాధ్యాయులతో బోధన జరిగే విధంగా వర్కులోడును రూపొందిస్తున్నారు. అదేవిధంగా తరగతికి 60 మంది విద్యార్థులు దాటితేనే రెండో సెక్షన్ ఇస్తున్నారు. వీటన్నిటి ద్వారా నాణ్యమైన విద్య అందించే అవకాశం కోల్పోయే విధంగా ఉంది.

తరగతికి 45 మంది విద్యార్థులు పరిమితం చేసి ఉపాధ్యాయుల సంఖ్యను కేటాయింపు చేయాలని యుటిఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులని కేటాయించాలని కోరుతున్నారు. హైస్కూల్, హై స్కూల్ ప్లస్‌లకు గతంలో పిజిటిలను కేటాయించారు. ప్రభుత్వం పిజిటి ప్రమోషన్స్ ఇవ్వడం ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులు నియమించి హై స్కూల్ ప్లస్‌లను దీర్ఘకాలం కొనసాగించే విధంగా ప్రణాళిక రూపొందించాల్సిందిగా కోరుతున్నారు.

తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రం అయి వుండి తెలుగు మాధ్యమంలో చదువుకోడానికి విద్యార్థికి అవకాశం లేకుండా అన్ని పాఠశాలలను పూర్తిగా ఇంగ్లీష్ మీడియంగా మార్చి నిర్బంధ ఇంగ్లీష్ మీడియంను అమలు చేస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా ఉంది. తక్షణం అన్నీ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో సమాంతరంగా బోధన కొనసాగాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి

ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి హైస్కూల్స్ లో 1:45 నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయించాలి. ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంలుగా ఎస్జిటీలకు ప్రమోషన్స్ ఇచ్చి నియమించాలి. హై స్కూల్ ప్లస్ లకు పిజిటి ప్రమోషన్స్ ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం చాలా శోచనీయం. ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ మేరకు ఒక విద్యార్థి చేరిన తెలుగు మాధ్యమాన్ని నడిపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- తోటకూర రవి చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

కోటనందూరులో కలెక్టర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-కోటనందూరు



చెక్ డామ్ పరిశీలనకు బైకుపై వెళుతున్న కలెక్టర్

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం మండలంలోని వివిధ ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాల పురోగతిని తనిఖీ చేశారు. ఇందుకుపల్లి సమీపంలో వెదులగడ్డ, బొందుగడ్డ ప్రాంతంలో రైతులతో కలిసి ఆయన కాలినడకన వెదులగడ్డ, బొందుగడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. సాగునీటికి రైతులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామరాజు కట్టు శాశ్వత నిర్మాణం, తాత్కాలిక నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అక్కడ నుంచి బైకుపై బిళ్లనందూరు వద్ద చెక్ డ్యామ్, వెంకన్న కట్టు ప్రదేశాలను పరిశీలించారు. గ్రామంలో పాడి రైతు సూర్ల ఎర్ర పాత్రుడు నిర్మించిన మీని గోకులంను కలెక్టర్ పరిశీలించారు. మండల కేంద్రంలో పిహెచ్‌సిని కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్లు, పేషెంట్లు వివరాలు, మెడికల్ స్టోర్ రికార్డుల వివరాలు ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం కోటనందూరులో తాండవ నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ట్రైనీ డిఎస్‌పి సిహెచ్.జీవన, డిప్యూటీ డిఎం, హెచ్‌ఒ డాక్టర్ సరిత, ఎంపిడిఒ పి.వెంకటనారాయణ తహశీల్దార్ పి.సుభాష్, ఎఇ శివకృష్ణ, డిఇ రామసంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట



సమావేశంపై చర్చిస్తున్న ఆర్‌డిఒ మల్లిబాబు

సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం కోసం గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాట్లు చేసినట్టు కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు చెప్పారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యతో ఆర్‌డిఒ చర్చించారు. ప్రత్యేక సమావేశం విజయవంతానికి కౌన్సిలర్లు సహకరించాలని ఆర్‌డిఒ మల్లిబాబు కోరారు. మున్సిపల్ కౌన్సిల్లో 32 మంది సభ్యులు ఉండగా అనారోగ్యం కారణంగా ఒక సభ్యుని మృతి నేపథ్యంలో ఆ స్థానం ఖాళీగా ఉందన్నారు. దీంతో కౌన్సిల్లో ఎక్స్ అఫీషియో సభ్యునితో కలిపి 31 మంది సభ్యులు ఉన్నారని ఆయన తెలిపారు. సమావేశం నిర్వహించేందుకు ఎక్స్ అఫీషియో సభ్యునితో కలిపి ఉన్న 31 మంది సభ్యులలో మూడింట రెండొంతుల మంది హాజరైతే గాని కోరం పూర్తి కాదని, మూడింట రెండొంతుల మెజారిటీ సభ్యులు హాజరైతేనే సమావేశం ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ఎన్నిక నిర్వహించేందుకు కూడా మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలని ఆయన వివరించారు. ఇటీవల వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్ళిన కౌన్సిలర్ల పరిస్థితిపై విలేకరులు ప్రశ్నించగా వారు వైసిపి గుర్తుపై గెలుపొందినందున ఆ పార్టీ సభ్యులుగానే పరిగణిస్తామని తెలిపారు.



యువతులతో మాట్లాడుతున్న కలెక్టర్

శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాశక్తి-పిఠాపురం

జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా వివిధ అంశాలపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కోరారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ బ్యూటీషియన్ కోర్సు ఇతర అంశాలపై శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణ కాలం, కోర్సు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఆసక్తి ఉన్న అంశాలపై శిక్షణ కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మురళీ, తహశీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అధికారే అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అందిన అర్జీలను గ్రీవెన్స్ అధికారి మాత్రమే పరిష్కరించాలని డిఆర్‌ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని వివేకానంద హాల్లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, డిఎల్‌డిఒ వాసుదేవరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణతో కలిసి డిఆర్‌ఒ గ్రీవెన్స్ దరఖాస్తులు పరిష్కారం చేసే విధానంపై పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలో వాటి గురించి వివరించారు. దరఖాస్తు చూసిన వెంటనే తమ శాఖకు సంబంధించినదో కాదో పరిశీలించి తమ శాఖకు సంబంధిస్తే ఒకే చేయాలని, కాదంటే సంబంధిత శాఖ వారికి ఫార్వర్డ్ చేయాలని ఆయన సూచించారు. తమ శాఖకు సంబంధించినది అయితే తరువాత ఆ గ్రీవెన్స్ పరిశీలించి గ్రీవెన్స్ దారుని సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న డిఆర్‌ఒ వెంకట్రావు

మట్టి అక్రమ తవ్వకాల అడ్డగింత

ప్రజాశక్తి-పిఠాపురం

ఫక్రుద్దీన్‌పాలెంలో బుధవారం మట్టి అక్రమ తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని సుమారు 80 ఎకరాల పాపిడిదొడ్డి చెరువులో కొందరు ఇటుక బట్టీ వ్యాపారులు మట్టిని తరలించకపోయేందుకు సిద్ధపడగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై యంత్రాలను అడ్డుకుని నిరసన వ్యక్తం తెలిపారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని భారీగా అక్రమంగా మట్టిని తరలించకుపోయేందుకు వ్యాపారులు సిద్ధ పడినట్టు తెలుస్తోంది. బట్టీ వ్యాపారులు అక్కడికి చేరుకుని ఫక్రుద్దీన్‌పాలెంకు చెందిన రైతులు, గ్రామస్తులు, వ్యవసాయ కార్మికులతో వాగ్వివాదానికి దిగారు. తమ పరిధిలో ఉన్న చెరువు మట్టిని తవ్వకొని వెళితే మీకేంటి సంబంధం అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య కొంతసేపు తీవ్ర వాగ్వివాదం చోటు చేసకుంది. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్య పూర్వకంగా సరిదిద్దుకోవాలని రూరల్ ఎస్ఐ జాన్ బాషా ఇరు వర్గాలకూ సూచించారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని బట్టి వ్యాపారాలకు మట్టిని ఎలా తరలిస్తారని అక్కడికి చేరుకున్న తహశీల్దార్ గోపాలకృష్ణను గ్రామస్తులు ప్రశ్నించారు. సంఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఇటుక బట్టీ యజమానులు దురుసుగా ప్రవర్తించారు.



మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పలువురు కోరుతూ బుధవారం ప్రచారం చేశారు.

ప్రజాశక్తి-యంత్రాగం

కాకినాడ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అర్బన్ పిహెచ్‌సి ఉద్యోగుల నాయకుడు జివివి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఏళ్ళ తరబడి ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏనాటికైనా రెగ్యులర్ చేస్తారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈలోపు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అయినా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్ల నాయకులు బి.శ్యామ్, ఎం.నాగేశ్వరరావు, మందపల్లి సూర్యప్రకాష్, కొల్లి శ్రీనివాస్, ఆర్.లక్ష్మీనారాయణ, ఎంవి.ప్రభాకరరావు, అనపర్తి ఏడుకొండలు, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు పాల్గొన్నారు.

కాజులూరు శీల, దుగ్గుదుర్రు గ్రామాల్లో ఉపాధి కూలీలతో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు.

పెద్దాపురం ఎపి రైతు కూలీ సంఘం, ఎఐఎఫ్‌టియు, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం పెద్దాపురం మండలం పులిమేరులో విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ సార్వత్రిక సమ్మెలో అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఎఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, డి.సురేష్ రెడ్డి, దుర్గాదేవి, వర్ధనపు శివాజీ, ముసలిబాబు, బిడిల నాగేశ్వరరావు, పలివెల సత్తిబాబు, పోశయ్య, రాఘవులు, దాకే నాగరాజు పాల్గొన్నారు.

కరప సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని నడకుదురు, పెనుగుదురు, గొర్రిపూడిలో కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు




ప్రదర్శన చేస్తున్న వామపక్షాల నాయకులు



కరపలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కార్టూన్ 'నిజం'



17న మాజీ ఎంఎల్ఎ బుల్లబ్బాయి రెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మాజీ ఎంఎల్ఎ అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి ప్రథమ వర్ధంతి ఈ నెల 17న నిర్వహిస్తున్నట్టు వివిఎస్ విద్యా సంస్థల డైరెక్టర్ అనిశెట్టి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. నాగులపల్లి స్వగృహంలో ఆయన ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సంపర నియోజకవర్గంగా ఉన్నప్పుడు రెండు పర్యాయాలు కాంగ్రెస్ ఎంఎల్ఎగా ఆయన పని చేశారని పేద బడుగు వర్గాలకు అనేక సేవలు అందించారని తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహనకు కళాజాతాలు

ప్రజాశక్తి-పిఠాపురం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 13 నుంచి 29 వరకు కళాజాతాతో హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. చేంజెస్ సంస్థ ప్రతినిధులు కెవిఆర్.శైలజ, కె.పుష్ప కుమారి ఆధ్వర్యంలో బుధవారం సాలిపేట, మంగయ్యమ్మ పేట, మార్కెట్ ప్రాంగణంలోని నటరాజ నిలయ చర్మచిత్ర కళా ప్రదర్శన కమిటీ ఆధ్వర్యంలో వీధి నాటకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారులు జయరామ్, వినయ్, ఐసిటిసి కౌన్సిలర్ లక్ష్మి, పి.దుర్గా భవాని పాల్గొన్నారు.

బిసి కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్య పేటల నిర్మించిన శ్రీ లక్ష్మీనారాయణ బిసి కమ్యూనిటీ హాలును బుధవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, దాసరి సూర్యనారాయణ, బైలపూడి సత్యనారాయణ, బొడ్డు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్టోరల్ అధికారి, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ఆధ్వర్యాన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను మార్పు చేయాలని, అవసరం ఉంటే పోలింగ్ స్టేషన్ వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ తహశీల్దారు ఎస్ఎల్ఎన్.కుమారి డిప్యూటీ తహశీల్దార్లు కల్యాణ్ చక్రవర్తి, కెఎల్.సురేష్ కుమార్, ఆర్ఐ ఎంవిడి.భవాని, రాజకీయ పార్టీల నాయకులు ఎస్.అప్పారావు, కెవి.లింగ రామయ్య, గదుల సాయిబాబు, ఆర్.వెంకటేశ్వరరావు, వైపి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి -కరప

మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారుల కోసం పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్టు ఎఇ సాన ఈశ్వర ప్రసాద్ తెలిపారు. వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సిజీఆర్ఎఫ్ సదస్సులో వినియోగదారులు నేరుగా పాల్గొని తమ సమస్యలను తెలపాలని కోరారు. కరప సెక్షన్ కార్యాలయంలో సిజిఆర్ఎఫ్ సంస్థ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ పాల్గొని దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. కొత్త కనెక్షన్ జారీలో ఆలస్యం, మీటర్ల మార్పు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, మీటరు లోపాలు, సర్వీస్ లోపాలు, రీ కనెక్షన్ సమస్యలు, బిల్లులో తప్పులు వంటి వాటిపై వినియోగదారులకు సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు.

తోటపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో బుధవారం అంబేద్కర్ 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఉదయం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మధ్యాహ్నం భారీ ఊరేగింపు నిర్వహించారు. రెండు గారడీ బృందాలు, కళాబృందం ర్యాలీలో సందడి చేశాయి. ఈ సందర్భంగా యువకులు అంబేద్కర్ చిత్రపటాన్ని చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. తోటపేట నుండి ప్రారంభమైన ర్యాలీ పోలేకుర్రు, పి.మల్లవరం, సుంకటరేవు జంక్షన్ వరకు సాగింది.

నేరాలు ఘోరాలు

బ్రాందీ షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని ప్రధాన రహదారిలో ఉన్న మైత్రి వైన్స్ షాపులో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. షాపు ఇంకా తెరవకముందే, స్థానికులు షాపులో నుంచి దట్టమైన పొగ, మంటలు రావడాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు షాపు షట్టర్లు తెరిచి చూడగా, పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటీన చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే, అప్పటికే షాపులోని మద్యం బాటిల్స్ దగ్ధం అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల విలువ చేసే మద్యం బాటిల్స్ పూర్తిగా కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకునిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకునిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, బిఎన్ఎస్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గాడిలంక గ్రామానికి చెందిన యువతిని ఐ.పోలవరం మండలం పశువులంక చెందిన చింతా సురేష్ కొంతకాలంగా ప్రేమించాడు. అయితే యువతిని ప్రేమపేరుతో మోసగించాడు. పెళ్లి చేసుకోమంటే తమ కులాలు వేరని పెళ్లికి ఇంట్లో వాళ్లు అంగీకరించరని సురేష్ మొఖం చాటేయటంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అమలాపురం డిఎస్‌పి టిఎస్‌కె.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాల సాగర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

9 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో గతంలో సారా కేసులకు సంబంధించి 9 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి బుధవారం స్థానిక తహాశీల్దారు సిహెచ్.వెంకట లక్ష్మి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గా అర్జునరావు తెలిపారు. గతంలో సారా కేసుల్లో బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా విధించారన్నారు. గతంలో సారా తయారీ, సారా అమ్మకాలకు సంబంధించిన వారు ఇకపై నేరాలకు పాల్పడకుండా ఈ బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు..

నగల దొంగకు జైలు శిక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని నగరం, కాట్రావులపల్లి గ్రామాల మధ్య నగలు చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 6 నెలలు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. 2024లో ఒక మహిళ తన భర్తతో కలిసి వేట్లపాలెం ఫంక్షన్‌కు వెళ్లి బైకుపై వస్తుండగా విశాఖపట్నం జిల్లా కంచరపాలెం ప్రాంతానికి చెందిన భీమలశెట్టి కమలనాథ్ బైక్‌తో వెంబడించాడన్నారు. అలా వారి బైక్ వెనుక వస్తూ ఆమె మెడలో ఉన్న 15 గ్రాముల మంగళ సూత్రం తాడును తెంపుకుని పరారయ్యాడన్నారు. వారి ఫిర్యాదు మేరకు అప్పుడు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుని కోసం గాలించి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి దేవీ రత్నకుమారి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మండపేట

నియోజకవర్గం చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిం చాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. బుధవారం విజయవాడ ఎ1 కన్వెన్షన్ సెంటర్ నందు రాష్ట్ర చేనేత ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట నియోజకవర్గ చేనేత కార్మికులతో మంత్రి సవితను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించి, వారి సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. దీనిపై మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు ఎంఎల్ఎ వేగుళ్ల తెలిపారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలం లోని అనాతవరం గ్రామానికి చెందిన పేరూరి మహాలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం కలిగిన మృతురాలి కుటుంబానికి మంజూరైన రూ.ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును బుధవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బారాజు చేతులు మీదుగా మృతురాలి భర్త నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రమాద వశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ప్రమాద బీమా చెక్కు ద్వారా ఆదుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేరూరి మహాలక్ష్మి టిడిపి సభ్యత్వం కలిగి ఉండటంతో మంజూరైన ప్రమాద బీమా రూ.ఐదు లక్షల చెక్కును ఆమె భర్త నాగబాబుకి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గొలకోటి దొరబాబు అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల పథ్వి రాజు, కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, శీలం వెంకటేశ్వరరావు, పేరిచర్ల సురేష్ రాజు, పెయ్యల వెంకటరమణ, అందే శ్రీను, ఇళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జి.మూలపొలం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న యర్రగురువు గ్రామంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి 30 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం కలియుగ పాండవులు ఆధ్వర్యంలో పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ కాశి శర్మిల, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రేవు అప్పల స్వామి, అప్పారావు సమక్షంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు థీరి పరీక్ష నిర్వహించారు.

విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పిఠాపురం సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో సూర్యరాయ గ్రంథాలయంలోని చెలికాని భావనరావు సభా సదన్‌లో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో భాగంగా బుధవారం సుమారు 100 మంది విద్యార్థులు కాకినాడలోని ఎపిఎస్‌పి బెటాలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎం.నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య సాధనలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానందరావు, వెల్ఫేర్ ఆఫీసర్ రవిశంకర్, పోతుల శ్రీనివాసు, సిహెచ్.సతీష్, పోలుపర్తి వేణు, గంగా పావని, సత్యనారాయణ, వై.కరుణ కుమార్ పాల్గొన్నారు.

కందరాడ గ్రామంలో సమ్మర్ క్యాంపెయిన్ శిక్షణా తరగతులు ప్రాజెక్టు సిడిపిఒ సిహెచ్ ఎస్‌కె.దుర్గా దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బాలాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బి.అనుపమ, అంగన్వాడీ కార్యకర్తలు ఆర్.బేబీ, బి.సత్యవాణి, జి.కనకదుర్గ, కె.వెంకట రత్నం, ఎస్.రత్నకుమారి పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు వేసవిజ్ఞాన తరగతులను సందర్శించారు.

పెద్దాపురం స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలలకు పుస్తక పఠనంలో భాగంగా సృజనాత్మక కృత్యాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు తెలుగులో సంధులు, సమాసాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లయ్య, పాఠకులు వై.రాజేష్, ఎం.రామారావు, బి.అరవింద్, ఎ.వెంకటాచారి, పి మనోహర్, సిహెచ్ వీరబాబు పాల్గొన్నారు.

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో బుధవారం బాలలకు పేపర్ గ్లాసులతో బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, పావని, గూనూరు వెంకటరమణ, రొంగల అరుణ్ కుమార్, అమత, నమ్రత, నాని, సాయి, మణికంఠ, మనోజ్, బంగారం, సత్య, అంజలి, నరసింహమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.



కాకినాడలో కాశ్మీర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడలో కాశ్మీర్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఆపిల్ కాయలతో కూడిన చెట్లు, కాశ్మీర్ అందాలతో కొండ కోనలు, లోయలు, మంచు, నీరు వంటి సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన కాశ్మీర్ ఎగ్జిబిషన్ ముఖద్వారం పలువురిని ఆకర్షించింది. బుధవారం సాయంత్రం కాకినాడ జెఎన్‌టియు ఎదురుగా ఉన్న గ్రౌండ్లో ఈ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఎగ్జిబిషన్ సందర్శించిన వీక్షకులు కాశ్మీర్ మాదిరిగా ఏర్పాటు చేసిన ఈ ఆకర్షణలు చూసి ఆనందోత్సాహంలో తేలియాడుతున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి ప్రారంభించారు. టిడిపి కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు దవులూరి భద్రరావు, ఎం.రాజారెడ్డి మాట్లాడుతూ సాయంత్రం 4:00 గంటల నుంచి రాత్రి 11:00 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు.

కరాటేతో బాలికల్లో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆడపిల్లలపై వేధింపులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయని ఆకతాయిలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు కరాటే శిక్షణ ఎంతగానో దోహద పడుతుందని మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యాన వనంలో కరాటే పోటీలో విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ట్రైక్వాడో ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్ పోటీలలో బోట్ క్లబ్ ఉద్యానవనంలో శిక్షణ నిస్తున్న మాస్టర్ దడాల సతీష్ సారథ్యంలో పెద్ద స్థాయిలో పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. చిన్నతనం నుంచి శారీరక వ్యాయామం చేయడం వల్ల దృఢంగా ఎదుగుతారని అన్నారు. నేటి బాలల్లో ఒబెసిటీ అధికంగా ఉటోందని, శారీరక వ్యాయామం లోపించడమే దీనికి ప్రధాన కారణమని డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. మాస్టర్ దడాల సతీష్ మాట్లాడుతూ తమ సంస్థ తరపున కరాటే పోటీలలో పాల్గొన్న 14 మందికి స్వర్ణ, 13 రజిత, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టంల్ దాసరి శ్రీధర్ పాల్గొన్నారు.

టిఐఐకెఎంతో నన్నయ ఎంఒయు

ప్రజాశక్తి - రాజానగరం

శ్రీలంకకు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ (టిఐఎస్ కెఎం)తో నన్నయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం యూనివర్సిటీ ఇసి హాల్లో టిఎస్-ఎస్‌కెఎం వ్యవస్థాపకుడు ఇసాంక పి గమగే సహ విసిఆచార్య ఎస్.ప్రసన్న శ్రీ ఎంఒయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఎంఒయుతో అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, జాయింట్ రీసెర్చ్, జాయింట్ కాన్ఫరెన్సెస్, వెబినార్స్ వర్క్ షాప్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్స్, కమ్యూనిటీ సర్వీసెస్, పబ్లికేషన్ సపోర్ట్ సర్వీసెస్ వంటి పరస్పర సహకారం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో ఎంఒయు ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందాలని విసి ఆకాంక్షించారు.

డిఎల్‌డిఒ కార్యాలయం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని డిఎల్‌డిఒ కార్యాలయాన్ని బుధవారం జెడ్‌పి సిఇఒ వివిఎస్ లక్ష్మణ్ సందర్శించారు. జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా 73 డిఎల్‌డిఒ నూతన కార్యాలయాల ప్రారంభంలో భాగంగా ఆయన ఈ కార్యాలయంలో ఉన్న వసతులను, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎల్‌డిఒ కెఎన్‌వి.ప్రసాదరావు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, పంచాయతీ రాజ్ ఎఇ ఏసురత్నం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుకను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వచ్చే మెయిన్ రోడ్డుపై ఉన్న ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం డివైఎఫ్ఐ బృందం సాయిబాబా గుడి నుంచి ఐఎల్‌టిడి సెంటర్ వరకు ఉన్న రోడ్డును పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి బండ్ రోడ్డులో 7 ఇసుక ర్యాంపులు ఉన్నాయని, ఆ ర్యాంపుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది లారీలతో ఇసుకను రవాణా చేస్తున్నారని అన్నారు. లారీలపై నుంచి ఇసుక కింద పడకుండా రవాణా చేయాల్సివుందని, అయితే బరకాలను కప్పకుండా రవాణా చేయడం వల్ల రోడ్డుకు ఇరువైపులకు పడిపోతుందన్నారు. రోడ్డుపై ఇసుక పడటంతో వాహనదారులు జారిపోయి ప్రమాదాల భారిన పడుతున్నారని అన్నారు. ఇసుక లారీలకు సిటీలోకి అనుమతి లేదని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని తెలిపారు. కావున స్థానిక అధికారులు, నగర పాలక సంస్థ కమిషనర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, సిఐటియు నాయకులు. బి.పూర్ణిమరాజు స్థానిక ప్రజలు జి.రంగస్వామి, వంశీ,పండు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికా రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం పరంగా అందించాల్సిన సేవలు విషయంలోనూ కమిషన్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 39 గిరిజన వసతి గృహాలు, ఎస్‌టి కాలనీలు, పాఠశాలలు, మండల రెవెన్యూ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వారి సమస్యలను తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికై కమిషన్ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పింఛన్లు అందక బాధపడుతున్న బాధితులకు పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, మహిళల గౌరవానికి, భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను సుమోటోగా స్వీకరిస్తామని చెప్పారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాల పర్యటన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ అధికారులు స్పందించక పోతే ఎన్‌హెచ్ఆర్‌సికి నేరుగా అర్జీలు పెట్టుకోవచ్చునని అన్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం స్వయం ప్రతిపత్తి సంఘమని,దీనికి ఏ రాష్ట్రంలోనూ అనుబంధ సంఘాలు లేవని స్పష్టం చేశారు. నేరుగా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయలేని వారు ఆన్‌లైన్ ద్వారా nhrc.net నేరుగా ఫిర్యాదులు చేసుకోవచ్చునని తెలిపారు.

మరిడమ్మను దర్శించుకున్న మెజిస్ట్రేట్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని బుధవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.కృష్ణమాచార్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాకినాడ జిల్లా ఆడిట్ అసిస్టెంట్ ఆఫీసర్ రమణారావు మరిడమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి దేవస్థానం తరుపున ఆసాదులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, వేద పండితులు ఐవి ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ సేవలందించారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 365 మంది

ప్రజాశక్తి- పెద్దాపురం

10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారికి ఈనెల 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఇఒ విఆర్‌కె.చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు సంబంధించి 365 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండల పరిధిలోని 365 మంది అభ్యర్థులకు పెద్దాపురంలో జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసామన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

గోదావరిపై ఆనకట్ట సృష్టికర్త, డెల్టా నిర్మాత సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం కాండ్రకోటలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కాండ్రకోటలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది సేవలందిస్తారన్నారు. ఈ శిబిరంలో రైతులు, యువత, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంఎల్ఎ, తదితరులు

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరంలోని రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ కాపు, ఒంటరి, తెలగ, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ నూతన రామాలయంలో లక్ష్మీ గణపతి, సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామి, పద్మావతి అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, మాజీ ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వైసిపి నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, నాయకులు పర్వత గుర్రాజు, వరుపుల తమ్మయ్యబాబు, జనసేన నాయకులు మేడిశెట్టి బాబీ పాల్గొన్నారు

ఘనంగా సదాశివ నిలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి -తాళ్లరేవు

పి.మల్లవరం, జార్జిపేట వై.జంక్షన్‌లో నిర్మించిన సదాశివ నిలయం ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సలాది రామన్ నాయుడు, రత్న కుమారి దంపతులు నిర్మించిన ఈ సదాశివ నిలయంలో బుధవారం తన కుమార్తె సలాది ఉమా పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సలాది సత్య కృష్ణ, వల్లు సూర్యనారాయణ, కృష్ణంరాజు, సలాది సాంబశివరావు, నక్కల సత్యనారాయణ, శేషారత్నం, దమయంతి, తోట మల్లికార్జునరావు, కోన శివ, నిమ్మకాయల శ్రీనివాసరావు, సురేఖారాణి పాల్గొన్నారు.

ఉత్తీర్ణతలో నవోదయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దాపురం

నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం 10, 12 తరగతుల సిబిఎస్ఇ పరీక్షా ఫలితాల్లో అందరూ ఉత్తీర్ణులై ఉత్తమ ప్రతిభ చూపారని స్కూల్ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు 73 మంది హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. 12వ తరగతి పరీక్షలకు 37 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. 10వ తరగతిలో కూరాడ సత్యానందం 500కు 487 మార్కులతో ప్రథమ స్థానం, జన్యం సాయి పవన్, కొల్లు మహిత 473 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు. 12వ తరగతిలో పాబోలు నందగోపాల్, కరెడ్ల ప్రసాద్, యల్లమెల్లి ప్రియదర్శి కౌశిక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో విశ్రాంత తహశీల్దారు రేలంగి బాపిరాజు సౌజన్యంతో వ్యాధిగ్రస్తులకు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మనమెంత సంపాదించు కున్నాం అనేది ముఖ్యం కాదని, కానీ మనం ఎంతమందికి సాయం చేశామన్నది ముఖ్యమని తెలిపారు. పేదలకు దానధర్మాలు చేయడంలో ఎంతో సంతృప్తి లభిస్తుందని తెలిపారు. విశ్రాంత తహశీల్దారు రేలంగి బాపిరాజు తన పింఛనులో ప్రతినెలా వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు సమకూర్చడం అభినందనీయమని వెంకటేశ్వరరావు ప్రశంసించారు. డాక్టర్ సువర్ణ రాజు, అడబాల రత్న ప్రసాద్, కుమార్ యాదవ్, ఓం నమ శ్శివాయ, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యానాం

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కేంద్రపాలిత ప్రాంతం యానాంలో జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమ్మె ప్రాముఖ్యతను వివరించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చలేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలుకై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20న సమ్మె చేయడం ద్వారానే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాస్, దాసరి రాజు, తాళ్లూరు శ్రీనివాసరావు, కె.మధుబాబు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్


సత్తాచాటిన 'తిరుమల' విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యా సంస్థ తన సత్తాను చాటుకుంది. 120 మార్కులకు 120 మార్కులను ఊన్న వరుణ్‌తేజ్, ఆకుల నిరంజన్‌శ్రీరామ్, బల్లా రిషిత శ్రీస్వప్న, రూపిటి చన్హా సాధించారని, 120 మార్కులకు గాను 119 మార్కులతో 9 మంది విద్యార్థులు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో స్టేట్ 5వ ర్యాంకు, 7వ ర్యాంకు, 10వ ర్యాంకు, 11వ ర్యాంకులను కైవసం చేసుకోవడమే కాకుండా 50లోపు 9 మంది, 100లోపు 16 మంది, 500 లోపు 57 మంది విద్యార్థులు నిలిచారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.



పాలీసెట్ విజేతలకు అభినందిస్తున్న తిరుమల యాజమాన్యం



ఎపిఆర్‌జెసి ర్యాంకర్లను అభినందిస్తున్న తిరుమల యాజమాన్యం

ఎపిఆర్‌జెసి ఫలితాల్లో తిరుమల స్టేట్ ఫస్ట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఎపిఆర్‌జెసి ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో ఎంపిసి విభాగంలో బాలినేని కళ్యాణ్‌రామ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, బైపిసి విభాగంలో బొడ్డుపల్లి మనోజ్‌కుమార్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.ఫణిశ్రీవసంత్ 3వ ర్యాంకును, ఆర్.చన్హా 6వ ర్యాంకును, కె.అవినాష్ 7వ ర్యాంకును, ఊన్న వరుణ్ తేజ్ 8వ ర్యాంకును, కె.సాకేత్ గుప్త 9వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు. టాప్ 50లో 38 ర్యాంకులు, టాప్ 100లో 74 ర్యాంకులు, టాప్ 500లో 247 ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలను పొందారని అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.